క్లుప్తంగా

దాతల సహకారం అభినందనీయం



పెదకాకాని: శివాలయం అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహాయ సహకారాలు అభినందనీయమని దేవదాయ శాఖ డెప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ పేర్కొన్నారు. పెదకాకాని శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి మాచర్లకు చెందిన దాతలు దేవస్థానం ప్రసాదం పోటులో లడ్డూ ప్రసాదం తయారీ అనంతరం నిల్వ చేసేందుకు రూ.2,25,000 విలువ చేసే 30 స్టీల్ ట్రేలను విరాళంగా అందజేశారు. మాదాసు చిన్న సాంబశివరావు, సుబ్బలక్ష్మి దంపతులు, శివకృష్ణ, దేవిక దంపతులతో పాటు ప్రేమ్‌శంకర్, మనవళ్ళు అక్షయ్, వేదాంశ్ ఆలయానికి వచ్చి అందించారు. ఆలయ కార్యాలయంలో ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్, దాతలకు ప్రత్యేక దర్శనం, ఆలయ వేదపండితులు, వేద ఆశీర్వచనం చేయించి శ్రీ స్వామి శేష వస్త్రంతో సత్కరించి, లడ్డు ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

పొన్నూరు: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారంతో ముగిశాయి. పట్టణంలోని సుజాత జూనియర్ కళాశాల, పీబీఎస్ కళాశాల, వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో 884 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైన పరీక్షలు పూర్తి అయ్యాయి.

ఉపాధి మార్గంగా సేంద్రియ వ్యవసాయం

గుంటూరు రూరల్: ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశంగా సేంద్రియ రంగాన్ని నిరుద్యోగ యువత ఎంచుకోవటం సరైనమార్గమని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటనందున్న రైతు నేస్తం పౌండేషన్‌లో ప్రకాశం జిల్లాకు చెందిన ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాల వ్యవసాయ విద్యార్థులు సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ తరగతుల్లో పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ నెరవేర్చాలి

లక్ష్మీపురం: పట్టణాల్లో రెండు సెంట్లు, పల్లెల్లో మూడు సెంట్ల స్థలంలో ఇంటి నిర్మాణానికి ఐదు లక్షలు అర్హులైన పేదలకు ఇవ్వాలని వ్యక్తిగత అర్జీలు పేదలతో పూర్తి చేయించినట్లు సీపీఐ నగర కార్యదర్శి మాల్యాద్రి అన్నారు. బొంగరాలబీడు ప్రాంతంలోని 55వ డివిజన్‌లో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం ఇళ్ల స్థలాలకు సంబంధించి అర్జీలు పూర్తి చేసే కార్యక్రమం చేపట్టారు. నగరంలోని అన్ని డివిజన్‌లలో దరఖాస్తులు పూర్తి చేసి ఈనెల 18 నుంచి అన్ని వార్డు సచివాలయాల్లో అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, వి.వెంకటేశ్వరరావు, డి.వెంకటరత్నం, మస్తాన్, లెవీ, లక్ష్మీకమలమ్మ పాల్గొన్నారు.

ఘనంగా ఐద్వా ఆవిర్భావ దినోత్సవం

లక్ష్మీపురం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఆవిర్భావ దినాన్ని పాత గుంటూరు శ్రామిక నగర్‌లో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం జెండా ఆవిష్కరించారు. సంఘం జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ సంఘం స్ఫూర్తిని కొనసాగించాలని కోరారు. మానికొండ సూర్యావతి, కొమద్రాజు అచ్చమాంబ, మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, భిక్షావతి లాంటి నాయకులు హక్కుల కోసం పోరాటం చేశారని గుర్తు చేశారు. దేశవ్యాప్తంగా కోటి సభ్యత్వంతో రాష్ట్రంలో 2.30 లక్షల సభ్యత్వం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, ఎం.కృష్ణకుమారి, వి.ఆదిలక్ష్మి, కుమారి, శివమ్మ, అంకమ్మ, బుజ్జి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో



గుంటూరుఎడ్యుకేషన్: వెంగళరావున గర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో విద్యార్థినుల ప్రతిభకు అద్దం పట్టింది. తెలుగు, హిందీ, మ్యాథ్స్, సోషల్ సబ్జెక్టుల వారీగా విద్యార్థినులు తయారు చేసిన వంద నమూనా ప్రాజెక్టులు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా శివారెడ్డిపాలెం బీసీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్ మాట్లాడుతూ ప్రదర్శనలో విద్యార్థినులు రూపొందించిన నమూనా ప్రాజెక్టులు భావి శాస్త్రవేత్తలను రూపకల్పనకు దోహదం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వీర్ల త్రివేణి, ఉపాధ్యాయులు పి.రాజకుమారి, వెంకటేశ్వర్లు, కె.వేణుగోపాల్, ఎం.రాములు, మధు శ్రీ, కె.సాహితి, ఎం.కుమారి, జీఎల్ గణేష్, మధురస్వాతి, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సెరిబ్రల్ పాల్సీని నయం చేయవచ్చు..

- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే సమస్యను నివారించవచ్చు
- ప్రతి రోజూ జీజీహెచ్‌కు బాధిత చిన్నారులు
- ఉచితంగా ఆపరేషన్లకు అవకాశం

గుంటూరు మెడికల్: బిడ్డ పుట్టగానే ఏడుపు విని తల్లి పరవశించి పోతోంది. ఆ ఏడుపు కోసం వెయ్యికళ్లలో ఎదురుచూస్తుంటారు బంధువులు. కానీ ఆ ఏడుపు ఆలస్యమైతే.. అది సెరిబ్రల్ పాల్సీ కావొచ్చు. పుట్టే వెయ్యిమంది పిల్లల్లో ఇరువురు లేదా ముగ్గురు వ్యాధి బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్ జిల్లా సత్వర చికిత్స కేంద్రం(డైక్)లో బాధిత పిల్లలకు వైద్యసేవలు అందించి ఆపరేషన్లు ఉచితంగా చేయిస్తున్నారు.

మన దేశంలో సుమారు 40 లక్షల మంది వ్యాధి బాధిత చిన్నారులు ఉన్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 20 వేల మంది పిల్లలు వ్యాధితో బాధపడుతున్నారు. సెరిబ్రల్ పాల్సీ వ్యాధిపై అవగాహన లేకపోవటం వల్లే పిల్లలకు సరైన వైద్యం అందించటం లేదని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రతి రోజు రెండు కేసులు నమోదు అవుతున్నాయి.

జీజీహెచ్‌లో చికిత్స ఇలా..

వ్యాధి ఎలా వస్తుంది...

పుట్టే బిడ్డ గర్భంలో ఉండగానే మెదడులో కణాలు దెబ్బతినటం వల్ల వస్తుంది. రూబెల్లా లాంటి ఇన్‌ఫెక్షన్లు సోకినప్పుడు సోకుతుంది. అధికరక్తపోటు, పోషకాహారలోపం, తల్లిదండ్రుల రక్తం గ్రూపులు సరిపడక బిడ్డ మెదడు దెబ్బతినడం. కాన్పు కష్టంగా ఉన్నప్పుడు, బిడ్డను బయటకు లాగే సమయంలో మెదడుకు ఇబ్బంది కలిగినప్పుడు, బొడ్డు పేగును బ్లేడుతో కోసినప్పుడు ఇన్‌ఫెక్షన్లు సోకి, పుట్టగానే కామెర్లు సోకితే, మేనరికపు వివాహాల వలన, బిడ్డ పుట్టగానే రెండు మూడు నిమిషాల పాటు మెదడుకు ఆక్సిజన్ అందక బిడ్డ ఏడ్వకపోతే ఈ వ్యాధి సోకుతుంది. ఇది అంటువ్యాధి కాదు. వైరస్, బ్యాక్టీరియాల వల్ల రాదు.

లక్షణాలు...

పుట్టగానే బిడ్డ ఏడవకుండా ఉంటాడు. మెడ నిలబెట్టలేరు. పాకటం, బోర్లాపడటం, కూర్చోవటం, నిలబడటం, నడవటం ఆలస్యం అవుతాయి. నోటి వెంట చొంగ కారుతుంది. మెల్లకన్ను. సోషల్ స్మయిల్ నిరంతరం ఉంటుంది. రెండు కాళ్లు వెనక్కి పెట్టుకుని కూర్చుంటారు. బిడ్డ పుట్టిన మూడు నెలల్లోగా బిడ్డ కదలికల్లో తేడాలను తల్లిదండ్రులు గుర్తించాలి. పాలు తాగకపోవటం, మాటలు కష్టంగా ఉండటం, కాళ్లు, చేతులు వంకర్లు పోవటం, చేతులు, వేళ్లు స్వాధీనంలో లేకపోవటం, కాళ్లు కత్తెరలా వంకరపోవటం, కాళ్ల కండరాలు అతిగా స్పందిస్తూ బలంగా బిగుసుకుపోతాయి. ఉక్కు పిల్లల మాదిరిగా చాలా స్టిఫ్‌గా ఉంటారు. బిడ్డలో వయస్సుకు తగిన పెరుగుదల కనిపించదు.



ఫిజియోథెరపి చేస్తున్న డాక్టర్ టీనా

అందుబాటులో చికిత్స



సెరిబ్రల్ పాల్సీ బాధితులకు ఫిజియోథెరపి, ఆపరేషన్లు, ఇంజెక్షన్లు, మందులు వ్యాధి నియంత్రణ కోసం అందుబాటులో ఉన్నాయి. వ్యాధి వలన వచ్చే అంగవైకల్యానికి ఉచితంగా ఆపరేషన్లు చేసి నయం చేస్తాం. ఆపరేషన్ అనంతరం సాధారణ పిల్లల మాదిరిగానే జీవితాన్ని గడపవచ్చు. సెరిబ్రల్ పాల్సీపై అవగాహన కల్పించి వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

– డాక్టర్ యశస్వి రమణ, జీజీహెచ్ సూపరింటెండెంట్

డైక్ సెంటర్‌లో ఉచిత వైద్యం



జీజీహెచ్ డైక్ సెంటర్‌లో ప్రతిరోజూ ఐదుగురు సెరిబ్రల్ పాల్సీ చిన్నారులకు ఫిజియోథెరపి అందిస్తున్నాం. ప్రతిరోజూ రెండు కొత్త కేసులు చికిత్స కోసం వస్తున్నాయి. బిడ్డకు ఏడాది నుంచి మూడేళ్లలోపు ఫిజియోథెరపి క్రమం తప్పకుండా చేయించడం ద్వారా ఆపరేషన్‌తో పనిలేకుండానే సాధారణ జీవితాన్ని గడిపేలా చేయవచ్చు. కొన్ని కేసులకు తప్పనిసరిగా ఆపరేషన్ చేయాల్సి ఉంటుంది.

– కొత్త టీనా, ఫిజియోథెరపిస్ట్

ఇండియన్ బ్యాంక్ చేస్తున్న సేవలు అభినందనీయం

గుంటూరు రూరల్: ఇండియన్ బ్యాంక్ గ్రామీణ రైతాంగానికి చేయూతనందించటం అభినందనీయమని సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు శాసనసభ్యుడు ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. శనివారం జేకేసీ కళాశాల రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో ఇండియన్ బ్యాంక్‌తో సంగం డెయిరీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ఇండియన్ బ్యాంకు ముందుకు రావడం పాడి ఉత్పత్తిదారులకు మేలు కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత రైతాంగానికి ఇండియన్ బ్యాంక్ శాఖలను పెంచి మరింతగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వి.చంద్రశేఖరన్ మాట్లాడుతూ డెయిరీ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా పాడి రైతులకు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేస్తామని తెలిపారు. పాడి రైతులు బ్యాంకు ఆర్థిక సహకారంతో తమ ఉత్పత్తులను రెట్టింపు చేసుకుని ఆర్థికంగా బలపడే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. కార్యక్రమంలో సంగం డెయిరీ ఫైనాన్స్ మేనేజర్ సాంబశివరావు, ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వర రెడ్డి, అమరావతి, విజయవాడ ప్రాంత మేనేజర్లు డీఎస్ మూర్తి, రాజేష్ పాల్గొన్నారు.



అవగాహన ఒప్పంద పత్రాలను చూపుతున్న బ్యాంక్ అధికారులు, ఎమ్మెల్యే నరేంద్ర

పది విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాయాలి

ఎంఈఓ రాయల సుబ్బారావు

చేబ్రోలు: పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని చేబ్రోలు మండల విద్యాశాఖాధికారి రాయల సుబ్బారావు అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరు, వేజండ్ల, చేబ్రోలు గ్రామాల్లోని హైస్కూల్స్‌లోని పది పరీక్ష కేంద్రాలను శనివారం ఎంఈఓ పరిశీలించారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు పరీక్ష హాల్ టికెట్లు అందజేసి, ఓఎంఆర్ షీట్‌లు ఎలా పూర్తి చేయాలి, ఎగ్జామ్స్‌లో పాటించాలని నియమ నిబంధనల గురించి వివరించారు. పరీక్ష కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు, ఫర్నిచర్, లైట్లు ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం, మంచినీటి సౌకర్యం, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడానికి పరీక్ష కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నారాకోడూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఏడుకొండలు, మాధవీలత పాల్గొన్నారు. నారాకోడూరులోని ఏబీ ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు.



వేజండ్ల గ్రామంలోని పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ సుబ్బారావు

తొలిసారిగా నగరంలో గ్రీన్ వెండింగ్ జోన్

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సౌలభ్యం, సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులపై దోపిడీకి అడ్డుకట్ట వేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శనివారం గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కళాశాల దగ్గర వీధి వ్యాపారుల వెడింగ్ జోన్ ప్రారంభించి, గుర్తింపు కార్డులు అందించారు. గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ గుంటూరు నగరంలో వీధి వ్యాపారులు రోడ్లు, డ్రెయిన్ల మీద వ్యాపారాలు చేసుకోవడం వలన ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయని చెప్పారు. అదే విధంగా వీధి వ్యాపారులను కొందరు అద్దెల పేరుతో దోపిడీ చేయడం గుర్తించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో తొలిసారిగా వీధి వ్యాపారుల సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామన్నారు. తొలి విడతగా పాలిటెక్నిక్ కాలేజి వద్ద 56 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందిచామని, దశలవారీగా నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మాట్లాడుతూ వీధి వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రెండు వేల మంది వీధి వ్యాపారుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులైన వారిని గుర్తించడానికి జీఎంసీ చర్యలు తీసుకుంటుందన్నారు. వెండింగ్ జోన్లలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ షేక్ సజీల, కార్పొరేటర్లు మానం పద్మశ్రీ, ఈ.వరప్రసాద్, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఉపా సెల్ పీఓ రామారావు పాల్గొన్నారు.



వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కమిషనర్, పక్కన ఎమ్మెల్యే మాధవి

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి వార్షికోత్సవం నిర్వహించారు. ఎం.అంజనా సుధాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గాయత్రీ మహిళా సంగీత సన్మండలి గౌరవాధ్యక్షులు, వందేళ్లు పూర్తి అయిన పద్మశ్రీ డాక్టర్ అన్నవరపు రామస్వామి, మృదంగ విద్వాంసులు పద్మశ్రీ పండిట్ డాక్టర్ యెల్లా వెంకటేశ్వరరావు, సంగీత కళా సామ్రాట్, చిత్రవీణ విద్వాంసులు డాక్టర్ ఎన్.రవికిరణ్‌లను సత్కరించారు. అనంతరం డాక్టర్ ఎన్.రవికిరణ్(చెన్నై) చిత్ర వీణ శాస్త్రీయ సంగీత కచేరి అలరించింది. ప్రముఖ కళాకారులు కళారత్న మోదుమూడి సుధాకర్‌ను కూడా సత్కరించారు. కార్యక్రమంలో మాదల రత్నగిరిబాబు, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎంవై శేషరాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ ఎం.రాజరాజేశ్వరి, మాధవపెద్ది మీనాక్షి, పాటిబండ్ల లలితా దేవి, కార్యదర్శి ఏవీ మంగాదేవి, సహాయ కార్యదర్శి మాధవీకృష్ణ, కోశాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

సాయిబాబా మందిరంలో విద్యార్థుల పూజలు

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సాయి బాబా మందిరంలో పదో తరగతి విద్యార్థులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నెల 17వ తేదీ నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించి విద్యార్థులను ఆశీర్వదించారు.

ఉచిత బస్సు సౌకర్యం

ఈ నెల 17వ తేదీ నుంచి 31 వరకు పదో తరగతి విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజరు అజిత కుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు కండక్టరుకు హాల్ టికెట్ చూపించి పరీక్షా కేంద్రం వరకు ఉచితంగా ప్రయాణించాలని సూచించారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు బస్సులలో ఈ సౌకర్యం కల్పించామని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కొరిటెపాడు: గుంటూరు డీ 12 సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ రాజమోహన్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఫీడర్‌లో విద్యుత్ లైనుల మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొత్త లాలపురం, లాలుపురం, వై.జంక్షన్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రాంగణ ఎంపికల్లో ఆర్‌వీఆర్‌జేసీ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. శనివారం చౌడవరంలోని కళాశాలలో కంప్రైల్ ఐటీ కంపెనీ ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఎంపికల్లో కళాశాలలోని 49 మంది విద్యార్థులకు రూ.4 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ప్యాకేజీతో ఉద్యోగాలకు అర్హత సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని మాట్లాడుతూ ఈ ఏడాది 2024–25 విద్యా సంవత్సరంలో ఇప్పటికి 703 మంది ఉద్యోగాలు పొందారన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్ మాట్లాడారు. ప్రస్తుతం ఉద్యోగాల్లో నెలకొన్న పోటీ తత్వంలో తమ కళాశాల విద్యార్థుల ప్రతిభా నైపుణ్యాలకు ప్రముఖ దిగ్గజ కంపెనీల ద్వారా లభిస్తున్న ఉద్యోగ అవకాశాలు వారి ఉజ్వల భవిష్యత్‌కు భరోసాను కల్పిస్తుందన్నారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్స్ శ్రీనివాసరావు, సురేష్‌బాబు అభినందించారు.

రాజకీయ వేదికలుగా విలీన గ్రామ సభలు

పొన్నూరు: మండలంలోని పలు గ్రామాలు మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణకు మండల పరిషత్ అధికారులు చేపట్టిన గ్రామ సభలు రాజకీయ వేదికలుగా మారాయి. శనివారం మండలంలోని కట్టింపూడిలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖర్ రావు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ నేపథ్యంలో తమ గ్రామాన్ని మున్సిపాలిటీలో విలీనం చేయాలా.. వద్దా అనే అంశంపై గ్రామ ప్రజలు స్వచ్ఛందంగా తమ అభిప్రాయాన్ని సంతకం రూపంలో తెలియజేయాల్సి ఉంది.

విలీన ప్రక్రియతో కలిగే లాభ నష్టాలపై అధికారులు వివరించాల్సి ఉంది. ఈ సభలలో గ్రామ నాయకులు తమ ప్రభావాన్ని చూపుతున్నారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడు మున్సిపాలిటీలో కలిపితే చాలా నష్టపోతామని, గ్రామంగానే ఉందామని తెలియజేస్తూ ప్రజలను సందేహానికి గురి చేశారు. అలా మాట్లాడకూడదని ఎంపీడీఓ అతని వద్ద నుంచి మైక్ తీసుకున్నారు. ఇలా సభలలో నాయకుల ప్రమేయంతో కార్యక్రమ ఉద్దేశం నీరుగారుతోంది. ప్రజల అవగాహన కొరవడి, సంతకాలు చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు గ్రామం, మున్సిపాలిటీతో కలిగే ప్రయోజనాలు తెలియజేయాలని ప్రజలు కోరుతున్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కేఎస్ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శి సాయి నవీన్ కుమార్, వెల్ఫేర్ అసిస్టెంట్ జంగా సుధారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ చంద్రశేఖరరావు

ప్రతి ఒక్కరూ బ్యాంక్ ఖాతాలు కలిగి ఉండాలి

చేబ్రోలు: గ్రామీణ ప్రాంతాల్లోని బ్యాంక్ ఖాతా లేని ప్రతి ఒక్కరూ బ్యాంక్ అకౌంట్‌లను తీసుకోవాలని కెనరా బ్యాంక్ మేనేజర్ గాంధీ అన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిటర్స్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ అవార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం శలపాడు గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ ఉదయ్ కుమార్, కెనరా బ్యాంక్ మేనేజర్ గాంధీ, యూకో బ్యాంక్ మేనేజర్ నవీన్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ పథకాలను బ్యాంకుల ద్వారా పొందాలని, తప్పకుండా నామినేషన్ పెట్టుకోవాలన్నారు. బ్యాంక్ అకౌంట్‌లు తీసుకొని చిన్న మొత్తాల నుంచి పెద్ద మొత్తాల వరకు వివిధ రకాల డిపాజిట్‌ల ద్వారా పొదుపు చేసుకోవాలని సూచించారు. బ్యాంక్‌ల ద్వారా తీసుకున్న రుణాలను ప్రతి ఒక్కరూ సకాలంలో చెల్లించాలన్నారు. పొదుపు నగదు రహిత లావాదేవీలు గురించి కళాకారులు ప్రదర్శించిన వీధి నృత్యరూపకం గ్రామస్తులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో గ్రామ సర్పంచి మన్నెం శిరీష, ఎంపీటీసీ యు.వెంకటేశ్వరరావు, మన్నెం వేణుగోపాలరావు, పీఎస్ శ్రీలత, క్రాప్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి అరుణకుమారి, రిసోర్స్ పర్సన్ జానకిరామ్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జాషువా, మదన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెనరా బ్యాంక్ మేనేజర్

ఎన్టీఆర్ ఫొటోతో ఉన్న ఫ్లెక్సీని తొలగించారని ఆత్మహత్యాయత్నం

అడ్డుకున్న స్థానికులు, పార్టీ నాయకులు

లక్ష్మీపురం: టీడీపీ వ్యవస్థాపకుడు దివంగత ఎన్టీ రామారావు చిత్రాలతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించి, స్థానిక నాయకుల చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారని ఆరోపిస్తూ ఆ పార్టీ వీరాభిమాని శనివారం పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు నగరం రత్నగిరినగర్ ప్రాంతానికి చెందిన ఎన్టీఆర్ వీరాభిమాని మునగా సాంబశివరావు, అలియాస్ సాంబయ్య,(డ్రైవర్ రాముడు), అనే వ్యక్తి ఇటీవల గుజ్జనగుండ్ల వాటర్ ట్యాంక్‌ల వద్ద దివంగత ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అయితే అదే ప్రదేశంలో టీడీపీ కార్పొరేటర్ కోవెలముడి నాని, స్థానిక మైనారిటీ నాయకుడు బాబు చిత్రాలతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. సాంబయ్య ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించారు. దీంతో ఆవేదన చెందిన సాంబయ్య ఎన్టీఆర్ చిత్రాలతో ఉన్న ఫ్లెక్సీలను తొలగించినందుకు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన స్థానికులు సాంబయ్యను ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నారు. ఇంతా జరుగుతున్నా పట్టాభిపురం పోలీసులు మాత్రం కన్నెత్తి ఇటువైపు చూడలేదు.



పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నం చేసిన కార్యకర్త

ప్లాస్టిక్ వినియోగంతో అనర్థాలు

పొన్నూరు: ప్రతి ఒక్కరూ పాలిథిన్ విక్రయం, వినియోగాన్ని నిషేధించి ప్లాస్టిక్ రహిత పొన్నూరుగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. పురపాలక సంఘం ఆధ్వర్యంలో 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం నిషేధిత ప్లాస్టిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, కమిషనర్, నాయకులు పాల్గొని మురుగు కాలువల్లో పూడిక తీసి, పరిసరాలను శుభ్రం చేశారు. కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు మాట్లాడుతూ పాలిథిన్ సంచుల వలన కలిగే నష్టాలను వివరించారు. జనపనార సంచులతో కలిగే ప్రయోజనాన్ని తెలియజేసి, ప్రజలకు సంచులను అందజేశారు. నిడుబ్రోలు సామాజిక ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన రహదారిలో చేపట్టనున్న తాగునీటి పైప్‌లైన్ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కండేయబాబు, డాక్టర్ ఫిరోజ్ ఖాన్ పాల్గొన్నారు.



కాలువలో పూడిక తీస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

- **ఆర్టీసీ డిపోలో..**

పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని ఆర్టీసీ డిపో మేనేజరు అజిత కుమారి అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా డిపో పరిసరాలను శుభ్రం చేశారు. పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజి సిబ్బంది పాల్గొన్నారు.



కట్టింపూడిలో ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ

- **కట్టింపూడిలో..**

మండల పరిషత్ ఆధ్వర్యంలో కట్టింపూడిలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి. చంద్రశేఖరరావు, ఈఓపీఆర్‌డీ కేఎస్ మల్లికార్జునరావు పాల్గొని ప్రతి ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు వాడకం నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి చెత్త– పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందజేయాలని కోరారు. రోడ్లు, మురుగు కాలువలలో వ్యర్థాలను వేయరాదని సూచించారు.

పేద విద్యార్థులకు అండగా రెడ్డి హాస్టల్



నెహ్రూనగర్: పేద విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా వసతి, భోజనం ఇతర సదుపాయాలు కల్పిస్తున్న రెడ్డి జనభ్యుదయ మండలి(రెడ్డి హాస్టల్) సేవలు ప్రశంసనీయమని హైదరాబాద్‌లోని మల్లారెడ్డి డీమ్డ్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ అన్నపురెడ్డి రామస్వామి రెడ్డి కొనియాడారు. శనివారం హాస్టల్ విచ్చేసిన ఆయన మండలి సభ్యులతో ప్రత్యేక సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎంతో మంది పేద విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకురావడంలో రెడ్డి హాస్టల్ పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మండలి సెక్రటరీ కంది సంజీవరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పడాల సుబ్బారెడ్డి, నాయకులు సూరసాని వెంకటరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, జంగా సీతారామ్ ప్రసాద్ రెడ్డి, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.